క్లుప్తంగా

రంగడికి అశ్వవాహన సేవ



అశ్వవాహనంపై రంగనాథుడు

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి రంగనాథుడికి అశ్వవాహన సేవ నిర్వహించారు. భక్తులు విశేషంగా దర్శించుకుని ప్రణమిల్లారు. స్వామివార్లకు తిరుమంజనం తదితర పూజా కార్యక్రమాలను విశేషంగా జరిపారు. ఉభయకర్తలుగా కిడాంబి వెంకటనరసింహాచార్యుల వారసులు, అట్రవణం కుటుంబం వ్యవహరించింది. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె.శ్రీనివాసరావు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటలకు ముసుగుల సేవ(ప్రణయ కలహోత్సవం), చక్రస్నానం, తీర్థవాది, సాయంత్రం పుణ్యకోటి విమాన అలంకారోత్సవం జరుగనున్నాయని ఈఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

నూతన విద్యుత్ ఫీడర్, బ్రేకర్ల ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని బీవీనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో నూతన విద్యుత్ ఫీడర్, బ్రేకర్లను సోమవారం ఏర్పాటు చేశారు. టౌన్ ఈఈ శ్రీధర్ చేతుల మీదుగా వీటిని ప్రారంభించి, చార్జ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన ఫీడర్ పరిధిలో 36 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వస్తాయన్నారు. ఏఈఈ అశోక్, ఏఈ దామోదర్‌రెడ్డి, జూనియర్ ఇంజినీర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ కౌన్సిల్ సమావేశం



ప్రమాణం చేస్తున్న కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు

నెల్లూరు(అర్బన్) : స్థానిక మద్రాసు బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ ఆస్పత్రి మీటింగ్ హాల్లో పీఆర్‌టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి.కృష్టారెడ్డి, సీహెచ్ అజయ్ బాబులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కడప జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటశివారెడ్డి, ఎన్నికల పరిశీలకుడిగా తిరుపాల్ వ్యవహరించారు. ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ఖలీల్, తిరుపతి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుధీర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్లకు పదోన్నతులు కల్పించాలి

నెల్లూరు(అర్బన్) : వైద్యారోగ్యశాఖలో మాస్ మీడియా విభాగంలో పనిచేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్స్‌కు పదోన్నతులు కల్పించాలని వారు మంత్రి నారాయణను కోరారు. ఈ మేరకు ఏపీ హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీసెస్, వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర సచివాలయంలో వినతి పత్రం ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజర్ల సుధాకర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ, మహిళా సెక్రటరీ సరోజిని పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

నెల్లూరు(క్రైమ్) : ఓ యువకుడిపై ఇద్దరు బీర్ బాటిల్‌తో దాడి చేసిన ఘటన డైకస్‌రోడ్డులో సోమవారం చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. వెంగళరావ్‌నగర్‌కు చెందిన షారూక్ సోమవారం డైకస్‌రోడ్డుకు వెళ్లారు. మద్యం షాపు మీదుగా వెళ్తుండగా ఆటోలో మద్యం సేవిస్తున్న ఇద్దరు యువకులు 'ఏం రా.. కనిపిస్తే పలకరించవా' అంటూ బీర్‌బాటిల్‌తో అతనిపై దాడి చేశారు. గాయాలపాలైన షారూక్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. దాడి చేసిన వ్యక్తులు అదే ప్రాంతానికి చెందిన వారని సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

2,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు(అర్బన్) : జిల్లాలో ఒక్కరోజే రైతుల నుంచి 2,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని జేసీ కార్తీక్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 13,065 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వ మద్దతు ధర కల్పించామన్నారు. రైతులకు రూ.28.05 కోట్లను జమ చేశామన్నారు.

విద్యుత్ అధికారులు ముందుకు రావాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది ముందుకొచ్చి పీఎం సూర్యఘర్ సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూర్యఘర్ జిల్లా నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర సూచించారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లో ఆయన సోమవారం మాట్లాడారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది, వారి బంధువులు, స్నేహితులకు సూర్యఘర్‌పై అవగాహన కల్పించి, ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యలను పరిష్కరించండి సారూ..

• కలెక్టరేట్, ఎస్‌ఎంసీకి పోటెత్తిన ప్రజలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం వినతులు వెల్లువలా పోటెత్తున్నాయి. నగరంలోని కలెక్టరేట్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పోటెత్తి వచ్చి అర్జీలు ఇస్తుంటే.. అదేరీతిలో కార్పొరేషన్ కార్యాలయంలో కూడా నగర వ్యాప్తంగా ప్రజలు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. తాగునీరు సరిగ్గా రావడం లేదని, వీధుల్లో చెత్త పేరుకుపోతున్నాయని, సుందరీకరణ చేపట్టాలని వంటి పలు సమస్యలను ప్రజలు అర్జీల రూపంలో అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

గడువులోపు పరిష్కారం చూపాలి

నెల్లూరు(బారకాసు) : ప్రజల నుంచి వచ్చిన వినతులను గడువులోపు పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ పాల్గొని వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీదారులు, రిటైలర్లు తగిన జాగ్రత్తలు తీసుకొని నిషేధించిన ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీని నిలిపివేయాలన్నారు. క్రమం తప్పకుండా ప్లాస్టిక్ ఉత్పత్తుల దుకాణాలపై దాడులు నిర్వహిస్తామన్నారు. అర్జీలకు సంబంధించి విభాగాల వారీగా ఇంజినీరింగ్-11, హౌసింగ్-16, టౌన్ ప్లానింగ్-15, రెవెన్యూ-4, పబ్లిక్ హెల్త్-7 చొప్పున మొత్తం 59 ఫిర్యాదులను అందుకున్నారు. అదనపు కమిషనర్ నందన్, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ పద్మజ, సెక్రటరీ శ్రీలక్ష్మి, మేనేజర్ ఇనాయతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

మూడ్రోజులుగా తాగునీరు లేదు

• అధికారుల తీరుపై కార్పొరేటర్ ఆగ్రహం

నెల్లూరు(బారకాసు) : అధికారుల నిర్లక్ష్యం వల్ల 14వ డివిజన్‌లోని పలు ప్రాంతాలకు మూడు రోజులుగా తాగునీరు రావడం లేదని ఆ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎస్‌ఎంసీలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి కోసం డివిజన్‌లోని పలు ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్కడో షట్టర్ రిపేరు చేయాలనే చిన్న కారణంతో మూడు రోజులుగా తాగునీటి సరఫరాకు అంతరాయం కల్పించారని మండిపడ్డారు. ఒక్కరోజులో చేసే రిపేరును మూడురోజులైనా చేయకపోవడం ఏమిటని నిలదీశారు. అదే మీ ఇళ్లల్లో తాగునీరు లేకపోతే సర్దుకుంటారా అని ప్రశ్నించారు. తాగునీటి సరఫరా కాని ప్రాంతాల్లో



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

ఇంజినీరింగ్ అధికారులు పర్యటించి పరిస్థితులను తెలుసుకున్న దాఖలాలు లేవని మండిపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో బోర్లు మరమ్మతులను తెలియజేసినప్పటికీ స్పందించకపోవడం దారుణమన్నారు. దీనిపై కమిషనర్ సూర్యతేజ స్పందిస్తూ వెంటనే వీలైనంత త్వరగా తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తామన్నారు.

కండలేరు అభివృద్ధిలో టూరిజం శాఖ నిర్లక్ష్యం

నెల్లూరురూరల్ : కండలేరు జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చడంలో టూరిజం శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనిపై దృష్టి సారించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. నగరంలోని తెలుగు గంగ అధికారులకు ఆయన సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్‌ను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసినట్లుగా కండలేరు జలాశయాన్ని కూడా అభివృద్ధి చేయాలన్నారు. ఇక్కడి పర్యాటక రంగానికి తగినంత స్థలం కూడా ఉందన్నారు. ఈ ప్రాంతంలో రిసార్ట్స్, స్విమ్మింగ్ పూల్, బోట్ షికారు, చిన్నపిల్లలు ఆడుకునే వసతులు కల్పిస్తే రాష్ట్రంలో ముఖ్యమైన పర్యాటక రంగంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎన్.సుబ్బారెడ్డి, నీలిశెట్టి లక్ష్మణరావు, నారాయణ యాదవ్, రాముల యాదవ్, కల్లు భాస్కర్, ఏవీ సుబ్బయ్య పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న మిడతల రమేష్

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



నిరసన తెలుపుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

నెల్లూరు రూరల్ : తమ సమస్యలను పరిష్కరించాలని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు వారు విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఆవరణలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. కేడర్ తెలియక, కాంట్రాక్ట్ ఉద్యోగిగా గుర్తింపు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. విధి నిర్వహణలో చనిపోయిన వారికి ఎలాంటి బెనిఫిట్స్ రావడం లేదన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ప్రభుత్వోద్యోగులుగా ఉండటంతో సంక్షేమ పథకాలకు కోత విధించారని వాపోయారు.

కాంగ్రెస్ నేతల వినతి

మహిళా రైతులు తాము పండించిన పంటలను రోడ్డుపై అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ నేతలు సంజయ్‌కుమార్, సుధీర్ పేర్కొన్నారు. మంత్రి నారాయణ చొరవ చూపి మున్సిపల్ మార్కెట్లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అధికారులకు వినతి పత్రం అందజేశారు.

ఎమ్మెల్సీగా చంద్రశేఖర్‌రెడ్డికి రెండేళ్లు పూర్తి



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు



ఇస్లామ్‌పేట సెంటర్‌లో..

• వైఎస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో సంబరాలు

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్సీగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి వేడుకలు నిర్వహించుకున్నారు. అనంతరం పార్టీ నాయకులు మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి విద్యాసంస్థలు స్థాపించి నేడు ఎమ్మెల్సీగా విశిష్ట సేవలందిస్తున్నారని తెలిపారు.

• నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఎమ్మెల్సీగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 54వ డివిజన్ ఇస్లామ్‌పేట సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు సోమవారం సాయంత్రం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు అస్లామ్, సలామ్, సత్తార్, ప్రసాద్, అల్లాభక్షు, మున్నా, తదితరులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలను తిప్పికొట్టాలి

నెల్లూరు(బారకాసు) : క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఎన్టీఆర్ నగర్, యాదవ వీధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన్ను పార్టీ నేతలు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా 11వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా మహేష్‌ను ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ డివిజన్లో వైఎస్సార్‌సీపీ పక్షాన నిలబడి ప్రజా పోరాటం సాగించేందుకు అందరికీ తోడుగా మహేష్ నిలుస్తారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం తొమ్మిది నెలల్లోనే ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. కార్పొరేటర్లు వేలూరు ఉమామహేష్, ఊటుకూరు నాగార్జున, కామాక్షిదేవి, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు సిద్దిక్, యువజన విభాగం నాయకుడు కిషన్, డివిజన్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



పర్వతరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నేతలు

సూచనలను ఆహ్వానిస్తున్నాం

నెల్లూరు(బారకాసు) : సిటీ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సూచనలను ఆహ్వానిస్తున్నామని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సూర్యతేజ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పలు సూచనలు చేశారు. ఓటర్లు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు వచ్చే రెండు నెలల్లో కసరత్తు చేపట్టనున్నట్లు వివరించారు.

వారాంతపు సమావేశం

ఇంజినీరింగ్, హౌసింగ్, టిడ్కో విభాగాలకు సంబంధించి స్థానిక ఎస్‌ఎంసీ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజ వారాంతపు సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఎల్అండ్‌టీ ఇంజినీరింగ్ కంపెనీ ప్రతినిధులకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కనెక్షన్లను వేగవంతంగా కొనసాగేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. అలాగే మెగా ఇంజినీరింగ్ వారికి స్వచ్ఛమైన నీరు అందేలా చూడాలన్నారు. అదనపు కమిషనర్ వైఓ నందన్, ఎస్ఈ రామ్మోహన్‌రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గందరగోళం మధ్యనే కౌన్సెలింగ్

• ఏఎన్‌ఎంల ప్రమోషన్ల జాబితాలో అప్పటికప్పుడు మార్పులు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గందరగోళం మధ్యనే సచివాలయ ఏఎన్‌ఎంల ప్రమోషన్లకు కౌన్సెలింగ్‌ను సోమవారం నిర్వహించారు. లోపాలతో కూడిన మెరిట్ జాబితాను తయారు చేసిన వారినే దగ్గర కూర్చోబెట్టి డీఎంహెచ్ఓ సుజాత కౌన్సెలింగ్ నిర్వహించడంతో దళిత సంఘాలు కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశాయి. దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ కల్పించలేదని, రోస్టర్ పాయింట్లలో లోపాలు జరిగాయని, అందువల్ల కౌన్సెలింగ్‌ను నిలిపి విచారణ జరపాలన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా కౌన్సెలింగ్‌ను తాను ఆపేది లేదన్నారు. అయితే అక్రమాలకు పాల్పడినట్లు కచ్చితమైన సమాచారంతో ఫిర్యాదు చేస్తే విచారించి కారకులైన వారిని సస్పెండ్ చేస్తామని తెలిపారు.



కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ

కేవలం రెగ్యులర్ సచివాలయ ఏఎన్‌ఎంలకు సంబంధించిన ప్రమోషన్ల జాబితాలో జీఓకు విరుద్ధంగా కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను కూడా చేర్చారు. ఈ విషయమై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో అప్పటికప్పుడు కాంట్రాక్టు ఏఎన్‌ఎంల పేర్లు తొలగించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే 830 పోస్టులకు సంబంధించి 289 మంది ఏఎన్‌ఎంలకు ప్రమోషన్లు కల్పించేందుకు డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ యశ్వంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా తలారి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రెండోసారి తలారి బాల సుధాకర్ నియమితులయ్యారు. 27 మంది సభ్యులతో పీసీసీ నియమించిన జిల్లా కమిటీలో తలారి బాలసుధాకర్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. దీంతో ఆయన్ను పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు సత్కరించారు.

వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తికి కాకాణి నివాళి



నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మృతిచెందారు. ఈ క్రమంలో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఒంగోలులోని సుబ్బారెడ్డి నివాసానికి వెళ్లి ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను వేస్తే జరిమానా

నెల్లూరు (బారకాసు) : ఖాళీ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 20వ డివిజన్ హనుమాన్ జంక్షన్, స్నేహ నగర్, అక్షయ గార్డెన్, వనంతోపు తదితర ప్రాంతాల్లో కమిషనర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ వాసులు ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు విసిరేయడం వంటి చర్యలను గుర్తించామని, అలాంటి వారికి జరిమానా నోటీసులు జారీ చేయమని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ శేషగిరిరావు, వెటర్నరీ వైద్యుడు డాక్టర్ మదన్‌మోహన్, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సర్వేయర్ కామేశ్వరరావు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం మెయిన్‌రోడ్డు, ఇస్లామ్‌పేట, పునరావాస కాలనీ, డెయిరీ ప్రాంతం, పెట్రోలు బంక్ గుంత, అంబేడ్కర్ కాలనీ, నల్లకాలువ, లక్ష్మీస్ట్రీట్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయన్నారు.

పీసీఆర్ చట్టం అమలుపై సమావేశం నేడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : పీసీఆర్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి కె.శోభారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు హాజరు కావాలని కోరారు.

కళాకారులకు ఆడిషన్స్ నేడు

నెల్లూరు(బృందావనం) : ఫోర్ పిల్లర్స్ ఫిలిమ్ హౌస్ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రతిభ గల కళాకారులకు ఆడిషన్స్‌ను మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్మాత ముక్కు రాధాకృష్ణ గౌడ్ తెలిపారు. స్థానిక చెన్నై హాస్పిటల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఆవరణలో సోమవారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని కళాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో చిత్ర దర్శకుడు ప్రవీణ్ బండ, డీఓపీ వెంకీ దొమ్మరాజు, కో-డైరెక్టర్ శ్రీనివాస్, కో-ప్రొడ్యూసర్ నవీన్ పాల్గొన్నారు.

మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించాలని మీటర్ రీడర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హజరత్‌వలీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విద్యుత్ భవన్‌లో నెల్లూరు టౌన్, రూరల్ ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హజరత్‌వలీ మాట్లాడుతూ, మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 20వ తేదీన విద్యుత్ భవన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నామని, మీటర్ రీడర్లకు నేరుగా ఎస్కో ద్వారా వేతనాలు చెల్లించాలని సీఎండీ ఇచ్చిన ఉత్తర్వులను జిల్లా ఎస్ఈ నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే సీఎండీ ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ ఈనెల 20న విద్యుత్‌భవన్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమానికి జిల్లాలోని మీటర్‌రీడర్స్ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నవీన్, కృష్ణసుబ్రహ్మణ్యం, సమద్, విజయసారథి, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



టౌన్ ఈఈకి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

రేపట్నుంచి త్యాగరాజ స్మరణోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరంలో ఈనెల 19 నుంచి 26వ తేదీ వరకు 60వ త్యాగరాజ స్మరణోత్సవాలు జరుగనున్నాయని కమిటీ కార్యదర్శి ఎనమండ్ర నాగదేవి ప్రసాద్ తెలిపారు. నగరంలోని పుర మందిరంలో స్మరణోత్సవాల ఆహ్వాన పత్రికలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా వేదాయపాలెంలోని త్యాగరాజస్వామి మందిరం నుంచి సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత త్యాగరాజ ఉత్సవ మూర్తులను, త్యాగరాజస్వామి చిత్రపటాన్ని బుధవారం ఉదయం 5 గంటలకు ఊరేగింపుగా పుర మందిరానికి తీసుకుని రానున్నామన్నారు. అలాగే రంగనాయకులపేట గోపురంవీధిలోని వేదాంత దేశికుల దేవస్థానం నుంచి కళాకారుడు ఆత్రేయ కిడాంబి నరసింహన్ అట్టముక్కలతో మూడు అడుగుల ఎత్తుతో తయారు చేసిన త్యాగరాజస్వామి ప్రతిమను, వెంకటేశ్వరస్వామి, శ్రీరాములు వారిని గరుడసేవ పూల అలంకరణలతో ఉత్సవముగా తీసుకు రానున్నట్లు వివరించారు. అలా ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హరికథలు తదితరాలు ఉంటాయన్నారు. కమిటీ ఉపాధ్యక్షుడు దేవులపల్లి శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారి ఎస్.నాగేశ్వర్, సభ్యులు హనుమంతరావు, చతుర్వేదుల రామచంద్రయ్య, టి.వెంకటేశ్వర్లు, కలవకాల కమల, డి.జనార్దన్, కృష్ణకుమార్, వంక శ్రీహరిప్రసాద్, కాళహస్తి సుబ్రహ్మణ్యం, వెన్నెలకంటి శివకుమార్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

నెల్లూరు(క్రైమ్) : మహిళలు, బాలికల భద్రతకు శక్తి యాప్ రక్షణ కవచమని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో శక్తి యాప్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించి మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విపత్కర సమయాల్లో ఈ యాప్ సాయంతో రక్షణ పొందవచ్చన్నారు. మహిళలు వారి ఇబ్బందులపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అన్ని సబ్ డివిజన్ల పరిధిలో ఏడు శక్తి బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వీరు జిల్లాలోని కళాశాలలు, ముఖ్య కూడళ్లను మఫ్టీలో సందర్శించి మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపడుతారన్నారు. కార్యక్రమంలో నగర, కావలి డీఎస్పీలు పి.సింధుప్రియ, పి.శ్రీధర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శక్తి పోస్టర్లను అందజేస్తున్న ఎస్పీ

ఎనర్జీ అసిస్టెంట్ల సంబరాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ప్రొబిషన్ పూర్తి చేసుకున్న జేఎల్‌ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లు నగరంలోని విద్యుత్ భవన్ వద్ద సోమవారం సంబరాలు చేసుకున్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు మాట్లాడుతూ, జేఎల్‌ఎం గ్రేడ్-2 అసిస్టెంట్లు సచివాలయానికి సంబంధించిన అన్ని పనులు చేస్తూ, విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం వీరిని విద్యుత్ సంస్థలో విలీనం చేసి విద్యుత్ ఉద్యోగులకు అందుతున్న సదుపాయాలు వర్తించేలా పోరాటాలు సాగిస్తామన్నారు. ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, యూనియన్ నాయకులు జాకీర్ హుస్సేన్, పెంచల ప్రసాద్, సుమన్, ఖాజారసూల్, ప్రసన్న, సునీల్, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.



19, 20న డీకేడబ్ల్యూలో వజ్రోత్సవాలు

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 19, 20వ తేదీల్లో వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షురాలు జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల అధ్యాపకులు, ప్రముఖులు, పూర్వ విద్యార్థులను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, పోలీసు అధికారులు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

⇨ స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో హిందీ భాష బోధనలో ఏఐ ప్రాధాన్యత అనే అంశంపై అంతర్జాల కార్యశాలను సోమవారం నిర్వహించారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జయశంకర్‌బాబు హిందీ బోధనలో ఏఐ ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆత్మారామ్, ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకుడు సురేంద్ర పాల్గొన్నారు.